

ప్రత్యేక అలంకరణలో మహా సరస్వతి

పిడుగురాళ్ల: నాగుల గుడిలోని మహాసరస్వతి అమ్మవారు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గోవాడలో శ్రావణ పూజలు

అమృతలూరు(భట్టిప్రోలు): గోవాడలోని బాలకోటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పార్వతి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

మూలాంకురేశ్వరికి విశేష పూజలు



ఫిరంగిపురం: అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి అమ్మకు శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ముఖ మండపంలోని శ్రీ చక్రానికి కుంకుమతో అర్చనలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

బగళాముఖి దీక్షలు ప్రారంభం



చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి ఆలయంలో భక్తులు శుక్రవారం అమ్మవారి మాలధారణ చేశారు. ఈ సందర్భంగా ఈవో నరసింహమూర్తి మాట్లాడుతూ శ్రావణమాసంలో అమ్మవారి భక్తులు బగళాముఖి దీక్ష తీసుకుని నియమ నిష్ఠలతో పూజలు నిర్వహిస్తారని తెలిపారు. శ్రావణ మాసం ప్రారంభం రోజున అమ్మవారి ఆలయంలో 11మంది భక్తులు దీక్ష చేపట్టారు. దీక్ష తీసుకునే భక్తులకు మాలలు, దుస్తులు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. శుక్రవారం సందర్భంగా బగళాముఖి అమ్మవారికి విశేష అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

బాపట్ల: ఐసీడీఎస్‌లోని అంగన్‌వాడీల ఉద్యోగాలకు జిల్లా జేసీ జి.గంగాధర్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు జరిగాయి. నాలుగు కార్యకర్తల పోస్టులకు 12 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అలాగే 49 ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు జరగ్గా 95 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మహిళ శిశు సంక్షేమ శాఖ పీడీ రాధామాధవి, సీడీపీఓలు పాల్గొన్నారు.

బోల్తాపడిన క్యాబేజీ లారీ



మేదరమెట్ల: బెంగళూరు నుంచి విజయవాడకు క్యాబేజీ లోడుతో వెళుతున్న ఐషర్ లారీ బోల్తా పడిన సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల తమ్మవరం బ్రిడ్జిపై శుక్రవారం జరిగింది. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో లారీ ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి వచ్చి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పారిపోగా కేసు నమోదు చేసినట్లు మేదరమెట్ల పోలీసులు తెలిపారు.

ముగ్గురి ప్రాణాలు కాపాడిన డ్రోన్



చీరాల: చీరాల మండలం వాడరేవు సముద్ర తీరంలో శుక్రవారం ముగ్గురు యువకులు అలల తాకిడికి కొట్టుకుపోగా రూరల్ ఎస్సై చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లను అప్రమత్తం చేసి ప్రాణాలు కాపాడారు. మార్టూరు మండలం కోలలపూడి గ్రామంలో అంకాలమ్మ తల్లి కొలుపుల సందర్భంగా గ్రామానికి చెందిన వెయ్యి మంది సముద్ర స్నానాలు చేసేందుకు వచ్చారు. వారిలో ముగ్గురు యువకులు సముద్రంలో ఎక్కువ లోతుకు వెళ్లి అలల తాకిడికి కొట్టుకుపోయారు. డ్రోన్ సహాయంతో యువకులను గుర్తించిన రూరల్ ఎస్సై చంద్రశేఖర్ వెంటనే విధుల్లో ఉన్న పోలీసులు, గజ ఈతగాళ్లను అప్రమత్తం చేశారు. స్పందించిన వారు నీటిలో కొట్టుకుపోతున్న ముగ్గురినీ కాపాడారు. ఎస్సై చంద్రశేఖర్ యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారితో పాటు వచ్చిన గ్రామస్తులకు క్షేమంగా అప్పగించారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



సంతమాగులూరు(అద్దంకి): కొమ్మాలపాడు మక్కెనవారిపాలెం గ్రామాల్లోని 453 మంది విద్యార్థులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం సైకిళ్లు పంపిణీ చేశారు. 46 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. అదే విధంగా మక్కెనవారిపాలెం గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, సీసీ డ్రైన్లను ప్రారంభించారు. ఆ తరువాత సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బర్లీ రైతుకు బాబు వెన్నుపోటు

ప్రభుత్వ నిర్ణయంపై పొగాకు రైతుల ఆగ్రహం

- పండించిన పంట మొత్తం కొంటామన్న ప్రభుత్వం
- నేడు ఒక్కో రైతు నుంచి 20 క్వింటాళ్లే కొంటామని మెలిక
- జిల్లాలో 53,067 ఎకరాల్లో బర్లీ సాగు
- అధికారిక అంచనాల ప్రకారం 90 వేల టన్నుల దిగుబడి
- ఇప్పటివరకూ మార్క్‌ఫెడ్ ద్వారా కొన్నది 3,700 టన్నులే
- మరో 10 వేల టన్నులే లక్ష్యం అంటున్న మార్క్‌ఫెడ్
- మిగిలిన పొగాకు ఎవరు కొంటారు?



మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేయకపోవడంతో పొగాకు బేళ్లు ఇంటికి తీసుకెళుతున్న రైతులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రైతుల అనుమానమే నిజమైంది. రైతులు పండించిన మొత్తం పొగాకు కొనుగోలు చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు మాటమార్చి ఒక్కొక్క రైతు నుంచి 20 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని మంత్రివర్గం తీర్మానం చేయడంపై పొగాకు రైతులు మండిపడుతున్నారు. ఇందులో టీడీపీకి చెందిన రైతులు కూడా ఉండడం గమనార్హం.

మాట మార్చిన ప్రభుత్వం

రైతులు పండించిన మొత్తం బ్లాక్ బర్లీ పొగాకు కొంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం మాటమార్చింది. ఇప్పుడు ఒక్కొక్క రైతు నుంచి 20 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీర్మానించి అన్నదాతలను నిలువునా ముంచింది. వాస్తవానికి బ్లాక్ బర్లీ సాగుచేసిన రైతుల్లో 95 శాతం మంది 4 ఎకరాల నుంచి 40 ఎకరాల వరకూ పొగాకు పంటను సాగు చేశారు. మూడు ఎకరాలలోపు పొగాకు సాగుచేసిన వారు నామమాత్రంగానే ఉన్నారు. ఈ ఏడాది ఎకరానికి 17 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు జిల్లా వ్యవసాయశాఖ అంచనా కట్టింది. ఈ లెక్కన 1.50 ఎకరాలలోపు సాగుతోనే 20 క్వింటాళ్ల బ్లాక్ బర్లీ దిగుబడి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఒక్కొక్క రైతు నుంచి 1.50 ఎకరాలలో పండిన పొగాకునే కొంటానని చెప్పింది. ఒకవైపు టొబాకో కంపెనీలు మొక్కుబడిగా కొనుగోలు చేసి చేతులు దులుపుకుంటుండడంతో రైతులు పండించిన మిగిలిన పొగాకును ఎవరు కొనుగోలు చేస్తారో ప్రభుత్వం చెప్పలేదు.

రైతులను నిలువునా ముంచిన బాబు

మంత్రివర్గ నిర్ణయం చూస్తే బ్లాక్ బర్లీ రైతులను నిలువునా వంచించినట్లే కనపడుతోంది. ఆది నుంచి రైతులకు చంద్రబాబు ప్రభుత్వం మాటపై అపనమ్మకమే. ప్రతిపక్షనేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒత్తిళ్లకు తలొగ్గి మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం ఆలస్యంగానైనా 12 కొనుగోలు కేంద్రాలు పెట్టి కొనుగోళ్లు మొదలు పెట్టింది. కొనుగోళ్లలో వివక్ష కనిపించినా ఆలస్యంగానైనా అందరి పొగాకు కొంటారని రైతులు భావించారు. చివరకొచ్చే సరికి ప్రభుత్వం ఏదొక సాకుచెప్పి తప్పించుకుంటుందని మిగిలిన రైతులతోపాటు రైతు సంఘాలు అనుమానిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు వారు అనుమానించినట్లే జరిగింది. ఒక్కొక్క రైతు నుంచి 20 క్వింటాళ్ల కొనుగోలు మెలికతో ప్రభుత్వం పొగాకు కొనుగోళ్ల నుంచి తప్పించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి తమ లక్ష్యం 14 వేల టన్నులేనని మార్క్‌ఫెడ్ చెబుతోంది. ఇప్పటికే దాదాపు 4 వేల టన్నులు కొన్నామని, మరో 10వేల టన్నులు మాత్రమే కొంటామ ని చెప్పి చేతులు దులుపుకుంది. ఈ లెక్కన ప్రభుత్వం ప్రకటనకు చేతలకు పొంతన లేదని స్పష్టమవుతోంది.

రైతుల ఖాతాల్లో జమ కాని డబ్బు

వాస్తవానికి ఈ ఏడాది జిల్లాలో 53,067 ఎకరాల్లో రైతులు బ్లాక్ బర్లీ సాగు చేశారు. ఒక్క పర్చూరు నియోజకవర్గంలోనే 52,989 ఎకరాల్లో బర్లీ సాగైంది. అద్దంకి నియోజకవర్గంలో 78 ఎకరాలలో మాత్రమే పొగాకు సాగుచేశారు. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం ఎకరాకు 17 క్వింటాళ్ల దిగుబడి అనుకుంటే మొత్తం 90 వేల టన్నుల దిగుబడి వచ్చింది. రైతులతో బ్లాక్ బర్లీ సాగుచేయించిన టొబాకో కంపెనీలు 30 వేల టన్నులలోపే కొనుగోళ్లు చేసి చేతులు దులుపుకున్నాయి. రైతుల వద్ద ఇంకా 50 వేల టన్నులకు పైగా పొగాకు ఉన్నట్లు తెలుస్తోంది. మార్క్‌ఫెడ్ 40 రోజులలో 3,700 టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. అదికూడా పచ్చపార్టీ నేతలు చెప్పిన రైతుల పొగాకు మాత్రమే కొన్నట్లు ఆరోపణలు వచ్చాయి.

ఎమ్మెల్యే ఏలూరి ఏమంటారో?

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మొదలు కొని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వరకూ రైతు పండించిన ప్రతి పొగాకు మట్టె కొంటామని, ఆందోళన చెందాల్సిన అవసరంలేదని బల్లగుద్ది చెప్పారు. ఒక్కొక్క రైతు నుంచి 20 క్వింటాళ్లు మాత్రమే కొంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం తేల్చి చెప్పడంతో ఇన్నాళ్లూ పొగాకు మొత్తం ప్రభుత్వం కొంటుందని బాకా ఊదిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతోపాటు ఆయన అనుచరగణం గొంతులో పచ్చివెలక్కాయ పడింది. ఇక నుంచి రైతులకు ఏం చెప్పాలో అర్థంకాక ఏలూరి తలపట్టుకున్నట్లు ఆయన అనుచరులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం సొంత పార్టీ రైతులకూ ఆగ్రహం తెప్పిస్తోంది.

ఆర్టీసీని బలోపేతం చేసేందుకు కృషి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర రవాణా, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

బాపట్ల: రాష్ట్రంలో ఆర్టీసీ సంస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ బాపట్ల డిపోను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శుక్రవారం సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉన్న అతిపెద్ద సంస్థ ఏపీఎస్‌ఆర్టీసీ సంస్థ అని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. త్వరలో మూడు వేల ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతామని చెప్పారు. ఏపీఎస్‌ఆర్టీసీ సంస్థకు పూర్వ వైభవం తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాపట్ల డిపోను మోడల్‌గా తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బస్టాండ్‌లో మరుగుదొడ్ల కాంప్లెక్స్‌ను నిర్మించడానికి, సిమెంట్ రహదారులు నిర్మిస్తామని చెప్పారు. బాపట్ల డిపోకు త్వరలో కొత్త బస్సులు కేటాయిస్తామని చెప్పారు. బాపట్ల నుంచి తిరుపతి, శ్రీశైలం బెంగళూరు ప్రాంతాలకు ప్రత్యేక బస్ సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు నైట్ అలవెన్స్ రూ.130కి పెంచామని చెప్పారు. ఆర్టీసీ కార్గో సేవలను ఇంటింటికీ డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. బాపట్ల డిపోలో ఉత్తమ సేవలందించిన ఏడుగురు సిబ్బందికి మంత్రి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలోఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఏపీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్, జిల్లా ప్రజా రవాణా రవాణా అధికారి డి.సామ్రాజ్యం, బాపట్ల డిపో మేనేజర్ పి.శ్రీమన్నారాయణ, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల దొంగలు అరెస్ట్



మేదరమెట్లలో మాట్లాడుతున్న డీఎస్పీ సయ్యద్ మొయిన్, పోలీసుల సమక్షంలో దొంగలు

మేదరమెట్ల: వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతర్ జిల్లాలకు చెందిన ఇద్దరి దొంగలను కొరిశపాడు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. చీరాల డీఎస్పీ మొయిన్ మేదరమెట్లలోని అద్దంకి రూరల్ సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈనెలలో కొరిశపాడు గ్రామంలోని హోటల్ నిర్వాహకురాలి మెడలో బంగారు చైన్ లాక్కొని పారిపోయిన ఇద్దరు దొంగలను పట్టుకోవడం కోసం ఓ టీంను ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే కొరిశపాడుకు చెందిన మేకల హరీష్, గుంటూరు సంజీవ్‌నగర్‌కు చెందిన షేక్ యాసిన్‌లను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వీరు గత నెలలో వేమూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పోయారు. వీరి వద్ద నుంచి కొరిశపాడులో పోయిన 28 గ్రాముల బంగారు గొలుసు, వేమూరులో పోయిన 30 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఓ మోటారు బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. విలాసవంతమైన జీవితానికి బెట్టింగులకు, చెడు వ్యసనాలకు బానిసలైన వీరు ఖర్చుల కోసం వివిధ ప్రదేశాల్లో ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారు. పర్చూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చైన్‌స్నాచింగ్‌లకు రెక్కీలు నిర్వహించినట్లు విచారణలో తేలింది. దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ మల్లికార్జునరావు, కొరిశపాడు, మేదరమెట్ల, జె.పంగులూరు ఎస్‌ఐలు సురేష్, మహ్మద్ రఫీ, వినోద్‌బాబుతో పాటు వెంకటేష్, నాగరాజు, మత్తయ్య కానిస్టేబుల్స్‌ను రివార్డులతో డీఎస్పీ అభినందించారు.

విపత్తులు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల: తుపాను హెచ్చరికల నేపథ్యంలో విపత్తును ఎదుర్కోవడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. విపత్తు నిర్వహణ, నిర్మూలన ప్రణాళికపై కలెక్టర్ జిల్లా, మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాలలో అధికంగా వర్షాలు కురుస్తున్నందున కృష్ణానది వరద విపత్తును దృష్టిలో ఉంచుకోవాలని చెప్పారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తును ఎదుర్కోవడానికి ముందస్తుగా ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రస్తుతం ఆలమట్టి, శ్రీశైలం, నాగార్జునసాగర్, కృష్ణా బ్యారేజి 90 శాతం నిండుగా ఉండడంతో ఎగువ నుంచి వరద వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కృష్ణానది కరకట్టపై నివాసముంటున్న గృహాల సర్వే చేయాలన్నారు. కరకట్టకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక, కంకర బస్తాలు సిద్ధం చేసుకుని కట్టను బలోపేతం చేయాలన్నారు. మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తీర ప్రాంత మండలాలలో గుడిసెలు, సిమెంటు రేకుల ఇళ్లను ముందస్తుగా గుర్తించాలని కలెక్టర్ చెప్పారు. తీరానికి పది కిలోమీటర్ల మేర తుపాను ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. గర్భిణులు, వృద్ధులు, మంచం పట్టిన వారు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు, చిన్నారులను గుర్తించి వివరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు, గ్యాస్ సిలిండర్, డీజిల్, కిరోసిన్, జనరేటర్లు, చెట్లు తొలగించడానికి యంత్రాలు, తదితర యంత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. సమావేశంలో డీఆర్ఓ జి గంగాధర్‌గౌడ్, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, వీక్షణ సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలి

స్వాతంత్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం ఏర్పాట్లపై ముందస్తు సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. పోలీస్ కవాతు మైదానాన్ని ముస్తాబు చేయాలని, జిల్లా ప్రగతి, అభివృద్ధిని చాటి చెప్పేలా శకటాల ప్రదర్శన ఉండాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విశేష సేవలు అందించిన ఉద్యోగులను ప్రశంసాపత్రాలతో సత్కరించడానికి అర్హులైన వారిని గుర్తించాలన్నారు. స్వాతంత్ర్య సమర యోధులను సత్కరించడానికి ఆహ్వానించాలన్నారు. వైద్య శిబిరాలు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సామాజిక వెనుకబాటులో ఉన్న వారిని ఆదరించాలి

సామాజిక వెనుకబాటులో ఉన్న ఎస్టీలు, విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఎస్టీలు, విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు కలెక్టర్‌కి అర్జీలు అందజేశారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ తక్షణమే పరిష్కార మార్గం చూపారు.

మిగిలిన నగదు ప్రభుత్వానికి చెల్లించాలి

ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో మిగిలిన నగదును ప్రభుత్వానికి తక్షణమే తిరిగి చెల్లించాలని కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. అలా చెల్లించకుండా ఉన్న వారికి తక్షణమే చార్జి మెమోలు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జి గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలపై ఉందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం అమలు తీరుపై అవగాహన కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులను చూడకుండా దూరంగా ఉంచితే పోషణ ఖర్చు కింద వారికి నెలకు రూ.10వేలు ఇవ్వాలన్నారు. డబ్బులు ఇవ్వకుండా నిలిపివేస్తే మూడు నెలలు జైలు శిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జి గంగాధర్‌గౌడ్, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి సువార్త, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఏ నాగధీర భద్రాచారి పాల్గొన్నారు.

కొత్తపేటకు ఎన్నికల కళ

- ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- పంచాయతీల పునర్విభజనపై హైకోర్టులో కేసులు వేసిన అప్పటి టీడీపీ నేతలు
- కోర్టులో కేసులు తొలగిపోవడంతో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం



కొత్తపేట గ్రామ పంచాయతీ

వేటపాలెం: ఎట్టకేలకు నాలుగేళ్ల నిరీక్షణ తరువాత కొత్తపేట పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటర్ల జాబితాలు, పోలింగ్ బూత్‌లతో సహా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల తేదీ ఖరారు చేయాల్సి ఉంది. కొత్తపేటలో 11,500 మంది ఓటర్లు, 16 వార్డులు, 32 పోలింగ్ బూత్‌లున్నాయి. 2020లో ఆధిపత్యం కోసం తెలుగుదేశం నాయకులు చేసిన ఘనకార్యం వల్ల చీరాల నియోజకవర్గంలో 23 గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ ఎన్నికల నిలిచి పోయాయి. వేటపాలెం మండల పరిధిలో మొత్తం తొమ్మిది గ్రామ పంచాయతీలు ఉండగా వేటపాలెం, దేశాయిపేట, కొత్తపేట వంటి మేజర్ పంచాయతీలు. వీటి పరిధిలో 16 శివారు గ్రామాలున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2021 ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీలకు ఎన్నికల నిర్వహించారు. అయితే చీరాల రూరల్, వేటపాలెం మండలాల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలు ఐదేళ్లుగా పంచాయతీ ఎన్నికలకు నోచుకోలేదు. నాడు వేటపాలెం పరిధిలోని రామన్నపేట పంచాయతీకీ మాత్రమే ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి.

గ్రామ పంచాయతీల పునర్విభజన ...

చీరాల రూరల్ మండల పరిధిలోని గ్రామ పంచాయతీల పునర్విభజన జరిగాయి. కొత్తగా రెండు గ్రామ పంచాయతీలకు ప్రదిపాధనలు పంపారు. అదేవిధంగా వేటపాలెం మండలంలో ఉన్న తొమ్మిది గ్రామ పంచాయతీలను పునర్విభజన చేసి అదనంగా మరో మూడు పంచాయతీలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పట్లో ఇది గిట్టని టీడీపీ నాయకులు పునర్విభజనపై హైకోర్టులో 2020లో కేసు వేశారు. దీంతో ఎన్నిలు నిలిచిపోయాయి.

మిగిలిన పంచాయతీల సంగతేమిటి?

హైకోర్టులో వేసిన కేసుల కారణంగా చీరాల నియోజకవర్గ పరిధిలో 2021 నుంచి 23 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిలిచి పోయాయి. అయితే దీనిపై ఆరు నెలల క్రితం కొత్తపేటవాసులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. కోర్టు తీర్పు రాగానే కొత్తపేట పంచాయతీ పరిధిలోని కొందరు గ్రామ పంచాయతీకి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. దీనిపై కోర్టు ఆరు నెలల్లో కొత్తపేట పంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ఎన్నికల కమిషనర్ జూన్ 17 తేదీ నాటికి ఓటర్ల జాబితాలు, బూత్‌లు సిద్ధం చేయాలని ఆదేశించారు. మరి చీరాల నియోజకర్గ పరిధిలో మిగిలిన 22 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో చూడాల్సిందే.

జల్సాలకు అలవాటుపడి బైకులు చోరీ

- ఇద్దరు మైనర్లు సహా తొమ్మిది మంది నిందితులు అరెస్ట్
- రూ.25 లక్షల ఖరీదైన ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జల్సాలు చేయడానికి సొమ్ము కోసం ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న తొమ్మిది మంది సభ్యుల ముఠాను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. సుమారు రూ.25 లక్షల విలువైన 34బైకులను వారి నుంచి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. గుంటూరులోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఇటీవల గుంటూరు తూర్పు, పశ్చిమ సబ్ డివిజన్లలోని పట్టాభిపురం, పాత గుంటూరు, నగరంపాలెం, తాడికొండ పీఎస్‌ల పరిధిలో ఎక్కువగా బైకు చోరీలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల పుటేజీలు, పాత నేరస్తుల కదలికలు, సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించామని చెప్పారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేశామని అన్నారు. ఈ కేసులో ఇద్దరు మైనర్లు (కేవీపీ కాలనీ 4వ వీధి, శ్రీనివాసరావుపేట వాసులు)తోపాటు అక్కిశెట్టి ఆకాష్ (ఎల్‌ఐసీ కాలనీ), ఉప్పు రాకేష్ (స్తంభాలగరువు), మడుగుల రవితేజ (కేవీపీ కాలనీ), షేక్ అషీరు (పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామం), కోన వెంకటగోపీ (లక్ష్మీనగర్ రెండో వీధి), టి.రాజేష్, బోయపాటి జయసాయి (తాడికొండ మండలం మోతడక గ్రామం ఎస్టీ కాలనీ)లను అరెస్ట్ చేశామని వివరించారు.

అందరూ 27 ఏళ్లలోపు వారే...

అరెస్ట్ అయిన వారందరూ 27 ఏళ్లలోపు వయస్సు వారే. వీరిలో ఇద్దరు మైనర్లు ఉన్నారు. రవితేజ, ఆకాష్‌లు చోరీలకు ఆజ్యం పోశారు. వీరంతా ముఠాగా ఏర్పడి కొంతకాలంగా గుంటూరు నగర పరిధిలోని ఇళ్ల ఎదుట, మార్కెట్ ప్రదేశాలు, ఆసుపత్రులు, ప్రార్థన స్థలాల వద్ద నిలిపి ఉంచిన బైకులను దొంగిలించారు. తర్వాత ఆ బైక్‌లను విక్రయించి సొమ్ము చేసుకునేవారు. వీరిలో ఒకరిద్దరు పాత నేరస్తులు ఉన్నారు. బైకులను కొనుగోలు చేసిన వారిని కూడా అరెస్ట్ చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. చోదకుల నిర్లక్ష్యం వల్లే వాహన చోరీలు జరుగుతున్నాయని అన్నారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. వాహనాలకు హ్యాండిల్ లాక్, వీల్ లాక్‌లను బిగించుకోవాలని చోదకులకు సూచించారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ (క్రైం), డీఎస్పీలు శివాజీరాజు (సీసీఎస్), అబ్దుల్ అజీజ్ (తూర్పు), అరవింద్ (పశ్చిమ), సీఐలు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

579 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 579.00 అడుగులకు చేరింది. ఇది 280.1200 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 511, ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 1,20,635 క్యూసెక్కులు వచ్చిచేరుతోంది.

సీఐ దూషించాడంటూ సర్పంచ్ ఫిర్యాదు

పర్చూరు(చినగంజాం): సీఐ తనను దూషించాడంటూ కారంచేడు మండలం దగ్గుబాడు గ్రామ సర్పంచ్ గేరా రవీంద్రనాథ్ ఠాగూర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. తనపై రౌడీ షీట్ ఉండటంతో ప్రతి శనివారం తాను కారంచేడు పోలీసుస్టేషన్ హాజరవుతున్నానని, హాజరు కాని పక్షంలో పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తనను ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య తను నోటికొచ్చినట్లు దూషించి అవమాన పరచారని తెలిపారు. వివిధ కేసుల నిమిత్తం తనపై ప్రత్యర్థులు 2023లో రౌడీషీట్ తెరపించారని వివరించారు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన తనను సీఐ దుర్భాషలాడుతూ, ముఖంపై కొడుతూ స్థానిక గ్రామస్తులు, రౌడీషీటర్‌ల ముందు అవమాన పరచారని తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్యను వివరణ కోరగా అతనిపై గతంలో ఏడు కేసులున్నాయని, ఈ మేరకు రౌడీ షీట్ తెరిచారన్నారు. రౌడీషీట్‌లను తెరచిన వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు కౌన్సెలింగ్ ఇచ్చే నిమిత్తం ప్రతి వారం పిలిపించి సంతకాలు తీసుకుంటామని, అందులో భాగంగా అతనికీ కౌన్సెలింగ్ ఇచ్చామని చెప్పారు. సదరు వ్యక్తి అనేక సార్లు కౌన్సెలింగ్ గైర్హాజరవుతున్న దృష్ట్యా రెగ్యులర్‌గా హాజరు కావాలని మందలించినట్లు తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి రెండు గేదెలు మృతి

మార్టూరు: విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామంలో ఓ రైతుకు చెందిన రెండు గేదెలు శుక్రవారం సాయంత్రం మృతి చెందాయి. లైన్‌మన్ వేణు, స్థానికుల తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు సోమల నాగేశ్వరరావుకు చెందిన రెండు గేదెలు మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామ సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి ఆ రెండు మూగజీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వలన తమకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని రైతు కుటుంబం కోరు తుంది. ఇదిలా ఉండగా విద్యుత్ శాఖ మార్టూరు ఏఈ కిరణ్ శుక్రవారం రాత్రి మాట్లాడుతూ నాగరాజు పల్లి గ్రామంలో శుక్రవారం సిబ్బంది మరమ్మతులు నిర్వహించింది గ్రానైట్ పరిశ్రమలకు సంబంధించిన హై టెన్షన్ లైన్ కోసమని విద్యుత్ తీగ తగిలి మృతి చెందిన వైరు గ్రామంలోకి విద్యుత్ సరఫరా చేసే ఎల్టీలైన్ అని ఆ తీగ ప్రమాదవశాత్తు తెగిపడిందని తెలిపారు.

నేటి నుంచి టైప్ రైటింగ్ పరీక్షలు

రేపల్లె: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ మంగళగిరి ఆధ్వర్యంలో ఈ నెల 26, 27తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా టైప్‌రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏపీ టైప్‌రైటింగ్ షార్ట్ హ్యాండ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సీవీ మోహనరావు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని తన టైప్‌రైటింగ్ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలలో రెండు రోజులపాటు ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషలలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు, ఇంగ్లిష్ విభాగంలో జూనియర్ గ్రేడ్, హైస్పీడ్ పరీక్షలు జరుగుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. రేపల్లెలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జులై 27వతేదీన మాత్రమే పరీక్షలు జరుగుతాయని, 56 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఆయా పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులు సంప్రదించాలని కోరారు.

సీఎంఎం నాయక్ సస్పెన్షన్

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థ మెప్మాలో సిటీ మిషన్ మేనేజర్ (సీఎంఎం)గా పని చేస్తున్న నాయక్, మెప్మాలో పనిచేస్తున్న ఓ రిసోర్స్ పర్సన్(ఆర్‌పీ) అశ్లీల చిత్రాన్ని సీఓ, సీఎంఎంల వాట్సాప్ గ్రూప్‌లో కొద్ది రోజుల కిందట పోస్ట్ చేసి డిలీట్ చేశాడు. ఈలోపు చాలా మంది ఆ చిత్రాన్ని చూసి, మెప్మా ఎండీ తేజ్‌భరత్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సీఎంఎంపై ఆగ్రహం వ్యక్తం చేసి అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని మెప్మా పీడీ విజయలక్ష్మిని ఆదేశించారు. ఎండీ ఆదేశాల మేరకు నాయక్‌ను సస్పెండ్ చేశారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి

పర్చూరు(చినగంజాం):పర్చూరు నియోజకవర్గంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావుతో కలిసి శుక్రవారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ముందుగా పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పర్చూరులోని నెహ్రూ కాలనీ, నాగులపాలెంలో పాల్గొని సూపర్ సిక్స్ పథకాలు అందుతున్నాయా అనే విషయమై ప్రజలతో మాట్లాడారు. పర్చూరులో రూ.కోటితో నిర్మించిన సీసీ రోడ్లు, నాగులపాలెం గ్రామంలో రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్త్రీ నిధి చెక్కులు పంపిణీ

అనంతరం పర్చూరు మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో పాల్గొని రూ.4 కోట్ల స్త్రీ నిధి చెక్కులను స్వయం సహాయక గ్రూపులకు అందజేశారు. అగ్రికల్చర్ డ్రోన్‌ను మంత్రి కేశవ్, ఎంఎల్‌ఏ సాంబశివరావు ప్రారంభించారు. అనంతరం పర్చూరు మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో పొగాకు కొనుగోలు తీరును అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏలూరి

ఇంకొల్లు మండలం ఇడుపులపాడు గ్రామంలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన పొగాకును పరిశీలించారు. చీరాల శాసనసభ్యుడు ఎం.మాలకొండయ్య, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న ఆర్డీఓ గ్లోరియా, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు, వైస్ చైర్మన్ శంకరశెట్టి చిరంజీవి, పార్టీ మండల అధ్యక్షుడు షంసుద్దీన్, నాయుడు హనుమంతరావు, తిరుమలశెట్టి శ్రీహరి, పాద వీరయ్య పాల్గొన్నారు.

దాడులు చేస్తే అది సివిలైజేషనా?

- వైఎస్సార్‌సీపీ నాయకుల ఆగ్రహం
- డిప్యూటీ సీఎం వ్యాఖ్యలకు ఖండన
- పోలీస్‌స్టేషన్‌లో నేతల ఫిర్యాదు

తాడేపల్లి రూరల్ : 'మంత్రి నారా లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ మాట్లాడుతుంటే.. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మాత్రం వాటిని అమలు చేసేందుకు విశ్వప్రయత్నం చేస్తూ ప్రజలను, తన అభిమానులను రెచ్చగొడుతున్నారు. వీరా మనల్ని పరిపాలించేది..' అంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరు కనకరావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సినిమా ఈవెంట్‌లో అభిమానులను రెచ్చగొట్టేలా మాట్లాడటంపై శుక్రవారం రాత్రి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ''సోషల్ మీడియాలో వచ్చే కామెంట్లకు మీరు భయపడాల్సిన అవసరం లేదు.. దాడి చేయండి.. కొట్టండి.. మీకు నచ్చిన విధంగా దాడి చేయండి.. అది సివిలైజేషన్' అంటూ పవన్‌కళ్యాణ్ రెచ్చగొట్టడం దారుణం'' అన్నారు.



పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 206

కొమ్ములు : 89 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,600	10,200	9,700

కాయలు : 117 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,600	10,200	10,000

మొత్తం అమ్మకాలు : 154.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,400 గరిష్టం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,800

కౌలు అర్జీలు పరిష్కరించేందుకు కృషి

జీఆర్‌ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ



తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యలు, వార్షిక కౌలు అర్జీలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని గ్రీవెన్స్ రీడ్రెస్సల్ మేనేజ్‌మెంట్ అధికారి పి.జయశ్రీ అన్నారు. తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఇటీవల రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అయిన 11వ ఏడాది వార్షిక కౌలుకు సంబంధించిన సమస్యల గురించి పలువురు తమ అర్జీలను పి.జయశ్రీకి అందజేశారు. సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. జమ కాని వారికి రానున్న 15 రోజులలో జమయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అర్జీలను రైతులు ఇచ్చి, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 54 ఫిర్యాదులు వచ్చాయి. స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు బి.సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, పి. పద్మావతి, జి. రవీందర్, జి. భీమారావు, ఏజీ చిన్నికృష్ణ, సీఆర్‌డీఏ సర్వే విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ జి.పాండురంగారావు రామకృష్ణన్, సామాజిక సంక్షేమ విభాగ అధికారి శ్రీనివాసరావు, డెవలప్మెంట్ ప్రమోషన్ జోనల్ జాయింట్ డైరెక్టర్ సి.హెచ్. మధుసూదనరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

గుంటూరు లీగల్: మహిళపై లైంగిక దాడి చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.57 వేల జరిమానా విధిస్తూ ఐదవ అదనపు జిల్లా సెషన్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. వివరాల ప్రకారం.. తాడేపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని సీతానగరం కరకట్ట వద్ద జరిగిన గ్యాంగ్ రేప్ కేసులో బాధితురాలి ఫిర్యాదు మేరకు 2021 జూన్ 19న కేసు నమోదు చేశారు. ముగ్గుర్ని నిందితులుగా పరిగణించారు. వారిలో రామలింగం ప్రసన్నరెడ్డి అలియాస్ వెంకట్ పరారీలో ఉన్నాడు. మరో నిందితుడు షేక్ హబీబ్ అలియాస్ హనిగుండు మృతి చెందాడు. ఇంకో నిందితుడు సిరు కృష్ణకిషోర్ అలియాస్ కృష్ణను దోషిగా కోర్టు పేర్కొంది. విచారణ అనంతరం అతడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.57 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నీలిమ తీర్పు వెలువరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లపు కృష్ణ బాధితురాలి తరపున వాదనలు వినిపించారు. అప్పటి సీఐ శేషగిరిరావు కేసు దర్యాప్తు చేయగా, డీఎస్పీ జె.రాంబాబు చార్జిషీట్ ఫైల్ చేశారు. కోర్టు లైజన్ కానిస్టేబుల్ బి.శ్రీనునాయక్, అప్పటి తాడేపల్లి కోర్టు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. మహిళకు న్యాయం జరిగేలా చూసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు.

బస్సులో బంగారు గొలుసు



అద్దంకి రూరల్: బస్సులో దొరికి బంగారపు చైనును ప్రయాణికులకు అందజేసిన కండక్టర్, డ్రైవర్‌ను డీఎం రామ్మోహన రావు శుక్రవారం అభినందించారు. సాయంత్రం దర్శి నుంచి అద్దంకి వచ్చిన బస్సులో కండక్టర్ ఏ. సుజాత, డ్రైవర్ యం. గిరిరాజులకు 12 గ్రాముల బంగారపు చైను దొరికింది. కాగా డ్రైవర్, కండక్టర్‌లు డిపో మేనేజర్ రామ్మోహనరావు సమక్షంలో అన్ని వివరాలు కనుగొని ప్రయాణికులు చంద్రకళ, చెన్నమ్మలకు అందజేశారు. చైనుకు లాకెట్ ఉండాలని చెప్పటంతో మళ్లీ బస్సులో వెతకగా లాకెట్ కూడా దొరకడంతో అదికూడా అప్పగించారు.

నైపుణ్యంతో కూడిన విద్యాబోధన అవసరం

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులతో కేఎస్ లక్ష్మణరావు, రామశేషాద్రిరావు, జనార్దన్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి కేంద్రంగా నైపుణ్యంతో కూడిన విద్యాబోధనను ఉపాధ్యాయులకు సాగించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్, టీచర్ ఆర్గనైజేషన్ (ఎస్‌పీఎల్‌టీఓ) ఆధ్వర్యంలో శుక్రవారం ఏటీ అగ్రహారంలోని జీకేఆర్ హైస్కూల్లో ప్రైవేటు ఉపాధ్యాయులకు మనోవిజ్ఞాన నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడికి ఉండాల్సిన లక్షణాలను వివరించారు. తరగతి గదిలో విద్యార్థి కేంద్రీకృత విద్యా బోధన జరగాలన్నారు. ఉపాధ్యాయుడే విద్యార్థికి లక్ష్య నిర్దేశకుడిగా వ్యవహరించాలని పేర్కొన్నారు. విజయవాడలోని ఎడ్యుకేషనల్ టీచర్ రీసెర్చ్ కౌన్సెలింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.రామశేషాద్రిరావు మాట్లాడుతూ మనోవిజ్ఞాన నైపుణ్య కౌన్సెలింగ్ విధానం ద్వారా ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థుల మానసిక స్థితిని గమనించి, అందుకు అనుగుణంగా విద్యాబోధన సాగించాలని సూచించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలన్నారు. జీకేఆర్ స్కూల్ డైరెక్టర్ జి.జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల మానసిక స్థితిలో మార్పులను తీసుకురావడంతోపాటు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంలో శిక్షణ తరగతులు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఎల్‌టీఓ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య, కార్యదర్శి ఎం.రాకేష్, కళాశాల విభాగ అధ్యక్షుడు కావూరి గోవిందరాజులు, జిల్లా, రాష్ట్ర స్థాయి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రైవేటు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులను హెచ్చరించిన డీఎంహెచ్‌ఓ

నరసరావుపేట: జిల్లాలోని ప్రైవేట్ నర్సింగ్‌హోమ్ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఎట్టి పరిస్థితులలోను భ్రూణ హత్యలకు పాల్పడరాదనీ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి హెచ్చరించారు. శుక్రవారం పల్నాడురోడ్డులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం 1994, రూల్స్ 1996 కింద జిల్లాలో నూతనంగా అల్ట్రా సౌండ్‌స్కాన్ సెంటర్స్ ఏర్పాటు, రెన్యువల్స్ దరఖాస్తు చేసుకున్న ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్, ఏఆర్‌టీ క్లినిక్ లెవెల్ -2 స్థాపనకు దరఖాస్తు చేసుకున్న ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ వారికి సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ మంజూరు చేసేందుకు వచ్చిన దరఖాస్తులపై సమీక్ష చేశారు. దీ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అంటూ తెలియచేయరాదని అన్నారు. ఆ విధంగా చేస్తే చట్టం ప్రకారం జైలు శిక్ష, జరిమానా విధించడంతో పాటు మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, స్కాన్ సెంటర్ సీజ్ చేయబడుతుందని హెచ్చరించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ యం. ప్రసూనా, ఏరియా హాస్పిటల్ గైనకాలజీ హెచ్‌ఓడి డాక్టర్ కె.విజయలక్ష్మి, సత్తెనపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ హెచ్‌ఓడి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బి.లక్ష్మణరావు, ఫిజీషియన్ డాక్టర్ ఎస్.గిరిరాజు, రోటరీక్లబ్ అధ్యక్షులు షేక్ కరీం, ఆశ వర్కర్స్ యూనియన్ లీడర్ దేవభక్తుల శివకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్ కె.సాంబశివరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాదనాయక్ పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	34,695
అమ్మకాలు	38,350
నిల్వ	4,416

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,400
341	10,000-13,600

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,800
నంబరు-5	10,000-13,500
341	10,000-13,600
4884	10,000-12,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,600
దేవనూరు డీలక్స్	10,000 - 12,500
ఆర్మూర్	9,600 - 11,000
తాలుకాయలు	5,000 - 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,400
దేవనూరు డీలక్స్	10,000-12,600
తాలు	5,300 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

బంగారు ఆభరణాలు చోరీ

లక్ష్మీపురం: ఇంట్లో శుభకార్యం జరుగుతున్న నేపథ్యంలో దాచి పెట్టిన 92 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయిన ఘటన పై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గుంటూరు నగరంలోని కొరిటెపాడు హనుమయ్యనగర్ ప్రాంతానికి చెందిన సుబ్రహ్మణేశ్వర అనే వ్యక్తి భవన నిర్మాణ పని చేస్తుంటారు. జూన్ నెలలో కుమారుడు వివాహం ఉన్నందున కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నారు. జూన్ 21న ఇంట్లో బీరువాలో 92 గ్రాముల బంగారు ఆభరణాలు భద్రపరిచి, వివాహ పనుల్లో ఉండి పోయారు. అయితే శుభకార్యం అయిన తరువాత ఈ నెల 23వ తేదీన చూసే సరికి ఆభరణాలు కనిపించలేదు. దీంతో శుక్రవారం అరండల్‌పేట పోలీసులకు సమాచారం తెలియజేయగా ఎస్సై సుబ్బారావు, సిబ్బంది వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీమ్ ఆధారాలను సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై సుబ్బారావు, క్లూస్ టీమ్

అన్ని వర్గాలకు అందుబాటులో దూరవిద్య



గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే వైవిధ్యమైన దూరవిద్య కోర్సులను ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) అందిస్తోందని ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పి.శరత్‌చంద్ర అన్నారు. శుక్రవారం ఎన్జీవో కాలనీలోని మహాత్మాగాంధీ కళాశాలలో ఇగ్నో కోర్సులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శరత్‌చంద్ర మాట్లాడుతూ దేశంలో అత్యధిక మంది విద్యార్థులు, అనేక కోర్సులతో విద్యను అభ్యసిస్తున్న ఉన్నతమైన విశ్వ విద్యాలయంగా ఇగ్నో గుర్తింపు పొందినట్లు చెప్పారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రంగా మన రాష్ట్రంలోని 15 జిల్లాలకు ఇగ్నో సేవలు అందిస్తోందని, డిగ్రీ, మాస్టర్ డిగ్రీ, డిప్లొమా, పీజీ డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సివిల్స్ స్థాయికి తగిన పాఠ్య ప్రణాళికతో కూడిన అంశాలు ఇగ్నో ప్రత్యేకతలు అని, ఒకే విద్యా సంవత్సరంలో ఒక రెగ్యులర్ కోర్సుతో పాటు దూరవిద్యా విధానంలో ఆన్‌లైన్‌లో మరొక కోర్సు అభ్యసించే వీలుందని తెలిపారు. కార్యక్రమంలో గౌతమి విద్యాసంస్థల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి, ప్రిన్సిపాల్ పి. ఉదయ్‌కిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలులో అవకతవకలు నివారించాలి

ప్రభుత్వానికి రైతు సంఘాల నేతలు డిమాండ్



లక్ష్మీపురం: రాష్ట్రంలో పొగాకు కొనుగోలులో అవకతవకలు నివారించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్ రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను పెంచాలని, నాణ్యత పేరుతో తెచ్చిన పొగాకును బయ్యర్లు వెనక్కి పంపకుండా చూడాలన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం పొగాకు రైతుల సంఘం నాయకుల సమావేశం డాక్టర్ కొల్లా రాజమోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీలు పొగాకు కొనకపోవడంతో ఆందోళన చేపట్టడం వలన మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు. కానీ గుంటూరు జిల్లాలో 50 కిలోమీటర్ల దూరం వెళ్లి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. సగం కూడా కొనుగోలు చేయకుండా బయ్యర్లు తిప్పి పంపుతున్నట్లు, ప్రైవేటు వారికి ఉపయోగపడేలా ఇలా చేస్తున్నట్లు ఆరోపించారు. దీంతో అయినకాడికి విక్రయించి రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 8 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఆందోళనలు, వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎం.హరిబాబు, కొల్లా రాజమోహన్, కంచుమాటి అజయ్, టి.రామారావు, జె.జయంతి బాబు, పి.శివాజీ, పి.రామారావు, కె.గణేశ్ బాబు, పి.వి. జగన్నాథం, కె.విఠల్ రెడ్డి, బిక్కి శ్రీనివాసరావు, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ రుణాలు సజావుగా ఇవ్వాలని వినతి

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ యాజమాన్యంలోని పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పీఎఫ్ రుణాల మంజూరులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్‌లు ఆరోపించారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో సీఈవో వి.జ్యోతిబసును ఆయన చాంబర్లో కలిసిన యూటీఎఫ్ ప్రతినిధులు బృందం దీనిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దరఖాస్తులను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారని పేర్కొన్నారు. తీరు మారని పక్షంలో జెడ్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు చేపడతామని హెచ్చరించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ కారుణ్య నియామకాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న వారికి న్యాయం చేయాలని కోరారు. పీఎఫ్‌కు సమస్యలను వారంలో పరిష్కారమయ్యేలా చూస్తామని సీఈవో హామీ ఇచ్చారు. సీఈవోను కలిసిన వారిలో నాయకులు జి. వెంకటేశ్వర్లు, ఎం. గోవిందు, కె. కోటిరెడ్డి, కె. ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి జైలు శిక్ష

గురజాల: ఒక వ్యక్తిని హత్య చేయడంతో పాటు మరొక వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 10వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి, గుంటూరు 4వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు శుక్రవారం తీర్పునిచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కందిమళ్ల సూర్యరాజు తెలిపిన వివరాల ప్రకారం....పిడుగురాళ్ళకు చెందిన ముచ్చు యోహాన్ ఇరిగేషన్ శాఖలో రిటైర్ అయ్యాడు. యోహాన్, భార్య చిట్టెమ్మ దంపతులకు సంతానం లేకపోవడంతో చిట్టెమ్మ బావ రెండవ కుమారుడు అంబేడ్కర్‌ను చిన్నతనం నుంచి పెంచుకుంటూ ఆమె బంధువు అయిన సుమలతకు ఇచ్చి వివాహం చేశారు. వారి దాంపత్య జీవితంలో ఇద్దరు సంతానం. అంబేడ్కర్ చెడు వ్యసనాలకు బానిసై హైదరాబాద్‌లో పలు దొంగతనాలకు పాల్పడి శిక్ష అనుభవించి బయటకు వచ్చాడు. అప్పటి నుంచి పిడుగురాళ్లలో యోహాన్ దంపతుల వద్దఉంటూ డబ్బు కోసం వేధిస్తున్నాడు. ఈ క్రమంలో 2024 ఫిబ్రవరి 21న యోహాన్ ఇంటి నుంచి బయటకు వస్తుండగా అంబేడ్కర్ కత్తితో యోహాన్‌ను పొడిచాడు. యోహాన్ గట్టిగా అరవడంతో భార్య చిట్టెమ్మ బయటకు వచ్చింది. బయటకు వచ్చిన చిట్టెమ్మను కూడా అంబేడ్కర్ కత్తితో పొడిచాడు. స్థానికులు వెంటనే అంబేడ్కర్‌పై రాళ్లు విసరడంతో పారిపోయాడు. ఈ ఘటనలో యోహాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. చిట్టెమ్మను పిడుగురాళ్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చిట్టెమ్మ నుంచి వాంగ్మూలం తీసుకుని అప్పటి పిడుగురాళ్ల సీఐ పీవీ అంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పునిచ్చారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపిక

చినగంజాం: బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్ ఎంపికలు కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బోగిరెడ్డి స్వామి రెడ్డి, కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14, అండర్ 20, అండర్ 18, అండర్ 20 గ్రూపుల వారు ఉదయం 8 గంటల్లోపు హాజరు కావాలని సూచించారు. జిల్లాలోని అథ్లెటిక్స్ మంచి అవకాశం కల్పించేందుకు ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఆగస్టు 9,10,11 తేదీల్లో పోటీలుంటాయని వివరించారు. పూర్తి సమాచారం కోసం 7416825797, 9542354041, 9666685864 నంబర్లను సంప్రదించాలని కోరారు.